**అడల్ట్స్ ఓన్లీ కథ**

# రహస్యం

బుల్లబ్బాయి దిగులుగా ఉన్నాడు. దిగాలుపడి వున్నాడు. దివాళా తీసినోడిలా నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చున్నాడు. శోభనం గదిలోనికి భార్య అడుగిడబోయే క్షణంకోసం ఆత్రంగా ఎదురుచూసినంత సేపు పట్టలేదు అతడి ఆత్రం చల్లబడిపోవడానికి.

'హతవిధీ.. శోభనం రోజున.. ఇలాంటి విచిత్ర విపత్కర పరిస్థితి ఏ మగాడికైనా ఎదురై వుంటుందా? ఇప్పుడేమిటి నా గతి? ఈ గండం గట్టేక్కేదెలా? శోభనం జరిగేదెలా? ఏ ముద్దూ మురిపెమూ లేకుండా ఈ రేయి ఇలానే తెల్లవారిపోదు కదా' లోపల్లోపల మథన పడిపోసాగాడు.


దీనితో తనకేమీ నిమిత్తం లేనట్టుగా నూతన వధువు పంకజం అదే గదిలోని సోఫాలో పడుకుని తీరికగా ఏదో పుస్తకం చదువుకుంటోంది. బుల్లబ్బాయి తనకేసి చూస్తుండటం గమనించి పెదవి వంపున నవ్వుతూ లేచి, వళ్ళు విరుచుకుంది. ఆ భంగిమలో రతీదేవిని తలపిస్తోన్న

**జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె**

ట్టుగా వున్న పంకజం అవయవసౌష్టవాన్ని ఆబగా చూస్తూ... బాడీ టెంపరేచర్‌ని పెంచేసుకున్నాడు బుల్లబ్బాయ్.

అతడి అవస్థని గమనించి పంకజం నవ్వుతూ ''ఊ..! కానీయండి. మీదే ఆలిశ్యం'' అంది.

''ఏమిటి కానిచ్చేది. శోభనం రోజు ఇలా మొగుడ్ని సిగరెట్ తాగమని.. మందుకొట్టమని ఏ భార్యా అడగటం నేన్చూళ్లేదు. కనీసం విన్లేదు'' అన్నాడు పెదవి విరుస్తూ.



''ఎవరి సంగతో ఏమో... నాకు మాత్రం సిగరెట్ తాగుతూ రింగురింగులుగా పొగవదిలే వాళ్ళన్నా... మందుకొట్టి బ్యాలన్స్‌డ్‌గా వుండగలిగే వాళ్ళన్నా అదో సరదా'' అంది పంకజం.

''అందుకోసం లేని అలవాటుని కొత్తగా చేసుకొమ్మంటావా?''

''భార్య ముచ్చట తీర్చాల్సిన బాధ్యత భర్తది కాదా?'' దీర్ఘం తీసింది పంకజం.

''నాకు అలవాటు లేదని చెపుతున్నాగా'' విసుగు ధ్వనించింది బుల్లబ్బాయ్ స్వరంలో.

''ఎందుకంత చిరాకు పడతారు. నేనేమడిగానని? మణులడిగానా... మాణిక్యాలడిగానా? ఆఫ్ట్రాల్ ఓ సిగరెట్.. ఓ పెగ్గు మందు తాగిపెట్టమనే కదా! ఆమాత్రం ముచ్చట తీర్చలేరా?''

బ్రతిమాలుతోన్న ట్యైపులో ఆమె అడిగిన తీరుకి బుల్లబ్బాయ్ కొంచెం మెత్తబడ్డాడు. పోనీ ఒక్కసారికి ఆమె కోరిక తీరిస్తే ఏమయింది అనుకుంటూ ''సరే నాకు బొత్తిగా అలవాటు లేదు. ఇప్పటికిప్పుడంటే కాదు. రేపు ప్రయత్నించి రేపు రాత్రికి నీ ముచ్చట తీరుస్తాను'' అన్నాడు లాలనగా.

పంకజం మొహం వెలిగిపోయింది.

''సరే! కానయితే ఓ షరతు. మీరు నా ముచ్చట తీర్చిన మీదటే నేను మీ ముచ్చట తీరుస్తాను''

అంటూ దిండు తీసుకుని చాప కింద పరచుకుంది.

బుల్లబ్బాయ్ ఖంగుతినిపోయాడు. ఏం

చేయడానికీ పాలుపోలేదు. సరసంగా సరసల్లాపాలాడుతూ సరదా చేయాల్సిన సమయంలో ఈ షరతులేమిటిరా బాబూ.. అనుకుంటూ పంకజం ప్రవర్తనకు విస్తుపోతూ విరహంతో వేగిపోతూ 'ఆట పట్టిస్తుందేమో... ఏ వేళో మంచం మీదికి రాకపోతుందా' అని పంకజంకేసే చూస్తూ రాత్రంతా జాగారం చేశాడు. పంకజం మాత్రం తెల్లవారేదాకా నిద్రలేస్తే ఒట్టు.

★ ★ ★

ఉదయమే వీధి చివరన ఉన్న కిళ్ళీకొట్లో పేపర్‌తోపాటు సిగరెట్ కూడా అడిగాడు. వింతగా చూస్తూ ''ఏ బ్రాండ్ ఇవ్వమంటారు సార్'' అని కొట్టువాడడిగితే ''ఏదో ఒకటి'' అనేసాడు. కొట్టు ముందున్న చెక్క బెంచీ మీద సెటిలై సిగరెట్ నోట్లో పెట్టుకుని, పక్కన తాడుకొసన వేళ్ళాడుతున్న నిప్పుతో వెలిగించి గట్టిగా దమ్ము పీల్చాడు.

అంతే! పొగ గొంతులో మంచు ఆవరించుకున్నట్లుగా ఆవరించుకొని దగ్గు తెరలు తెరలుగా వచ్చింది. దానితోపాటు గొంతంతా మండింది.

కొంచెం స్థిమితపడి మళ్ళీ దమ్ములాగాడు. మళ్ళీ అంతే అయింది. ఈసారి పెదిమలు కూడా మండాయి. తెరలు తెరలుగా వచ్చిన దగ్గుతో కళ్ళల్లోకి నీళ్ళు తోసుకొచ్చాయి.

కొట్టు ముందరి అందరి చూపులు తనకేసి తిరగడంతో అవమానంగా అనిపించి సిగరెట్ దూరంగా విసిరేసి 'అసలీ ధూమపానప్రియులంతా ఎలా తాగుతారో' అనుకుంటూ ఇంటికొచ్చాడు.

పంకజం కాఫీ అందిస్తూ ''మన మధ్య ఓ రాత్రి వృధా అయింది. మరిన్ని రాత్రులు వృధా కావడం నాకిష్టం లేదు. ఐనా సిగరెట్ మందు తాగటం లాంటివి మగాళ్ళెంత చులాగ్గా చేసేస్తారు. మీరేమిటి? అసలు సిగిరెట్ మందు లాంటి అలవాట్లేమి లేని మగాడూ ఓ మగాడేనా'' మూతి మూడు వంకర్లు తిప్పింది పంకజం.

పంకజం మాటల్లో మరేదో అర్థం ధ్వనించి బిక్క చచ్చిపోయాడు బుల్లబ్బాయి.

★ ★ ★

పంకజం మాటల్తో మేటరెంత సీరియస్సో తెలిసొచ్చింది. లాభం లేదనుకుంటూ, అప్పటికప్పుడు బయలుదేరి మిత్రుడైన నిత్యానంద్‌ని కలుసుకున్నాడు.

నిత్యానంద చైన్ స్మోకర్. రింగురింగులుగా పొగ వదలడంలోనూ నోట్లోంచి పీల్చి ముక్కులోంచి వదలడంలోనూ మంచి ఎక్స్‌పర్ట్. ఎంత మందు తాగి కూడా మాట తూలకుండా స్టడీగా వుండగలడు.

పలకరింపులైన తర్వాత విషయం చెప్పి, 'అసలు పంకజం పద్ధతి ఏంటంటావ్' అనడిగాడు.

''దీన్లో వింతేం లేదు. కొంతమంది ఆడాళ్ళు ఏ వ్యసనం లేని మగాడికంటే వ్యసనపరుడైన మగాడినే ఇష్టపడతారు. ప్రచార మాధ్యమాలలో పొగతాగడం.. మందుకొట్టడం వంటివి (ఒకప్పటి) ప్రచారాలలో మగతనానికి నిదర్శనంగా చూపడమే ఇందుక్కారణం. కొంతమంది ఆడాళ్ళు అలాంటి ప్రచారాల ప్రభావాన పడటం మూలానే ఇదంతా'' తన పరిజ్ఞానంతో విశ్లేషించాడు నిత్యానంద్.


మిత్రుడి మాటలతో 'బహుశా తన పంకజంలో కూడా అదే అభిప్రాయం బలపడి వుండాలి. అందుకే ఇలా సిగరెట్, మందుకూ శోభనానికీ ముడిపెట్టిందై వుంటుంది' అనుకుంటూ ''సరే! ఏదైనా కానీ తన ముచ్చట తీర్చాలి. సిగరెట్.. మందు తాగడంలో నాకు మెళకువలు కాస్త నేర్పు'' అన్నాడు.

''వార్నీ! ఇంతకాలం మేమెంత పోరినా ఛీ.. ఛీ.. అన్నావు. భార్య రాగానే మగాడు మారిపోతాడని ఉత్తినే అనరు. పోనీ! బాగుచెయ్యడమంటే కష్టం కానీ చెడగొట్టటమెంత? చిటికెలో పని.. పద'' అంటూ బుల్లబ్బాయి భుజం తట్టాడు.

పది నిమిషాల్లో ఇద్దరూ బార్‌లో వున్నారు.

## గ్లామరస్ ఇలియానా!

**స్కూ**ల్లో చదువుకునే రోజుల్లో మార్కులు సరిగ్గా రాకపోతే మా నాన్న బాగా కొట్టేవాడు. ఆ భయంతో పాసు మార్కులైనా సంపాదించడానికి కష్టపడి చదివేదాన్ని- అంటుంది ఇలియానా. తన ఫ్రెండ్సంతా తనని 'నువ్వు ఎంత అందగత్తెవే తప్పకుండా సినిమా తారవైపోతావు' అంటూ తెగ పొగిడే వాళ్లట. వాళ్లన్నట్టుగా తను సినిమా స్టార్‌ని అయిపోయాను అని మురిసిపోతోంది వయ్యారాల ఇలియానా!



మందు, చిప్స్‌తోపాటు సిగరెట్ ప్యాక్ కూడా ఆర్డర్ చేసాడు నిత్యానంద్. అవి రాగానే విస్కీని గ్లాసులలో పోసి సోడా కలిపాడు. తర్వాత సిగరెట్ ప్యాకెట్లలోంచి సిగరెట్ తీసి బుల్లబ్బాయికొకటి అందించి తనొకటి వెలిగించుకుని దమ్ములాగి వదుల్తూ ''ఊ.. వెలిగించు'' అన్నాడు.

ఉదయం వెలిగిస్తే తనకెలా మండుకొచ్చిందీ చెప్పాడు బుల్లబ్బాయి.

''సిగరెట్ అయినా మందైనా మొదటిసారి అలానే అనిపిస్తాయి. ఒక్కసారి అలవాటైన తర్వాత సిగరెట్‌కోసం పెదిమలు... మందు చుక్క కోసం గొంతు ఆవురావురంటాయి. ఇప్పుడు వెగటుగా అనిపించినవే అపుడు హాయిగా అనిపిస్తాయి'' వ్యసనోపదేశం చేసాడు నిత్యానంద్.

సిగరెట్ ఎలా నోట్లో పెట్టుకోవాలో పైన ఫ్యాను తిరుగుతోన్నా ఆరిపోకుండా అగ్గిపుల్ల ఎలా వెలిగించాలో పొగ ఎలా పీల్చి.. వదలాలో

వివరించాడు నిత్యానంద్. ఆ మేరకు ప్రయత్నించి, నోరు కాల్చుకోవడం తప్ప సిగరెట్‌ని 'నోటబట్టించు'కోలేకపోయాడు బుల్లబ్బాయి.

పోనీ మందు ట్రై చేద్దామంటే అప్పటికే పెగ్గు మీద పెగ్గులు లాగించేసిన నిత్యానంద్ 'కానీవోయ్ ఎలాగోలా.. ఇందులో ఏమంత విశేషముంది. గొంతులోనికి వంపుకోవడానిక్కూడా పాఠం చెప్పాలా' అంటూ మరో పెగ్గులో లీనమైపోయాడు.

## గౌరీ తీరు!

**బన్నీ, శ్రీకృష్ణా 2006 లాంటి విజయవంతమైన సినిమాల్లో నటించినా కూడా గౌరీ ముంజలికి అదృష్టం కలిసి రావడం లేదు. చెప్పుకోదగిన సినిమా చాన్సులు ఆమె ఇంటి తలుపుతట్టడం లేదు. అందుకనే ఏమో పబ్బుల్లో, ఫంక్షన్లలో సినిమా జనాల్ని కలిసి పరిచయాలు పెంచుకోవడం అలవాటు చేసుకుంటోందిట. అయితే పబ్బుల్లో ఎలాంటి డ్రింకులూ ముట్టుకోదట. కేవలం సరదాగా కలిసిన వాళ్లతో మాట్లాడుతుందిట. పబ్లిక్ రిలేషన్స్ పెంచుకుంటే సినిమా ఆఫర్లు వస్తాయనేది ఆమె ఆలోచనే అయినా లక్ కూడా కలిసి రావాలిగా అంటున్నారు సినీ జనాలు.**



దేవుడిమీద భారం వేసి గ్లాసెత్తి ఎలాగో గొంతులో పోసుకున్నాడు. సిప్ మీద సిప్‌గా తీసుకోవాలన్న విషయ జ్ఞానం లేకపోవటం వల్ల ముందు గొంతు, తర్వాత గుండె ఆ తర్వాత కడుపులోనూ ఒక్కసారిగా బుగ బుగమంటూ మంట పుట్టింది. ఎలాగో ఓర్చుకుందామనుకున్నంతలో కడుపులో తిప్పింది. అంతలోనే భళ్ళున వాంతయింది.

''మరీ మొత్తం గ్లాసు ఒక్క సిప్‌లో ఎత్తేస్తే ఎలారా? వాష్ బేసిన్ దగ్గర మొహం కడుక్కురా'' అన్న నిత్యానంద్ సలహాకి వళ్ళు మండినా ఏం చెయ్‌లేక మొహం కడుక్కుని, బిల్లు చెల్లించి బయటపడ్డాడు నిత్యానంద్‌ని తిట్టుకుంటూ. ఆరోజు రాత్రి కూడా అతడు తన బ్రహ్మచర్యాన్ని వదిలించుకోలేకపోయాడు.

★ ★ ★

మరుసటి రోజు కోఠిలోని ప్రముఖ పుస్తకాల షాపుల మీద పడ్డాడు బుల్లబ్బాయి. ఎక్కని కొట్టులేదు, దిగని మెట్టు లేదు. అదే పనిగా పుస్తకాలు తడుముతున్న బుల్లబ్బాయిని 'ఏ పుస్తకం కావాలో చెప్పండి. నేనున్నాను కదా!' అదేదో సిన్మాలో బ్రహ్మానందాన్ని అనుకరిస్తూ వంకర నవ్వు నవ్వాడు కొట్టువాడు బుల్లబ్బాయిచే కెలకబడ్డ పుస్తకాలను తిరిగి సర్దుకుంటూ.

''అది.. మరి...'' ఎలా చెప్పాలో తెలీక నసిగాడు బుల్లబ్బాయ్.

''పర్వాలేదు. చెప్పండి. డాక్టర్ సమరం పుస్తకాలా'' కన్ను గీటుతూ అడిగాడు కొట్టువా అదే నవ్వుతో.

''ఛ.. ఛ.. భలేవాడివే! అవి కాదయ్యా బాబూ. సిగరెట్.. మందు తాగటం ఎలా? అని పుస్తకాలేమైనా వున్నాయేమోనని...'' బుర్ర గోక్కుంటూ నసిగాడు.

''అందరూ మానడానికి అడుగుతారు. మీరు తాగడానికడుగుతున్నారే''కొట్టువాడు భళ్ళున నవ్వాడు. ''సారీ సార్! నాకు తెలిసి నా ముప్పయ్యేళ్ళ సర్వీసులో అలాంటి పుస్తకాలింత వరకు ఏ పబ్లిషరూ ప్రింట్ చేయలేదు. అంతే కాదు, వాటినెవరూ అడగనూ లేదు. మీ..లా..'' అన్నాడు.

'మీలా' అనడంలో ఏదో చెప్పకూడని వ్యంగ్యం ధ్వనించినా... మారు మాటా(ప)డకుండా 'భగవంతుడా.. ఇప్పుడేమిటి చెయ్యడం' అనుకుంటూ దారి తెన్నూ తోచని స్థితిలో కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చాడు.

భార్య ముచ్చట తీర్చలేని దరిమిలా ఆరోజు కూడా బుల్లబ్బాయి 'శోభనం ముచ్చట' తీరనే లేదు.

★ ★ ★

వారం రోజులు గడిచిపోయాయి పెళ్లయి.

భార్య ముచ్చట మేరకు సిగరెట్.. మందు అలవాటు చేసుకొనే దిశగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దానికి తోడు 'ఇంకెంత కాలం' అంటూ భార్య గొడవ కూడా మొదలైంది.

ఐక్యరాజ్య సమితి అమెరికా వత్తిళ్ళకు లొంగి అమెరికా ఆగ్రహానికి లోనైన దేశాలపై ఆంక్షలు విధించినట్లు... ఏ అడ్వర్టయిజ్‌మెంట్ వత్తిళ్ళ ప్రభావానికి లోనై తన భార్య ఇలాంటి షరతులు విధించిందో కదా అనుకంటూ ఒడ్డున పడ్డ చేపలా విలవిలలాడిపోసాగాడు. తనని మంచానికొదిలి తన మానాన తను కింద చాపపరుచుకొంటున్న పంకజాన్ని చూసి కోపం వస్తున్నా, ఆమె ముచ్చట తీర్చలేని తన అసహాయత మీదా అంతే కోపం వస్తూంది.

'ఇక ఇంతేనా? అదేదో సినిమాలో హీరో పెళ్ళికాని ప్రసాద్ అని పిలవబడినట్టు తను 'శోభనం కాని బుల్లబ్బాయి' అనిపించుకోవల్సిందేనా? వడ్డించడానికి పదార్థాలన్నీ వుండి విస్తరే తక్కువన్నట్టు పెళ్ళయి.. అందమైన భార్య వుండీ ఇంకా వీడని ఈ బ్రహ్మచర్యమేమిటి తనకు?' అనుకుంటూ మధనపడిపోయాడు.

'ఐనా పంకజం బుద్ధిలేక ఏదో అంటే.. తను బుద్ధి చెప్పాల్సింది పోయి.. తనకు అలవాటులేనివి అలవాటు చేసుకోవాలని చూడటమేమిటి? భర్తగా ఆమెపై పూర్తి హక్కు వుండి తానెందుకు ఆమె షరతుకు లోబడాలి. బలవంతంగానైనా తనని..' అనుకున్నాడు.

అంతలోనే, 'ఛ.. ఛ.. తనేమిటి ఇలా ఆలోచిస్తున్నాడు. భార్య తనని తాను ఇష్టంగా.. ప్రేమగా భర్తకి అర్పించుకోవడంలో ఆనందం వుంటుంది. కాని అధికారాన్నుపయోగించి లోబర్చు

కుంటే అందులో థ్రిల్లేముంటుంది? దిల్లేముంటుంది' అనుకున్నాడు.

★ ★ ★

సెలవు తీరిపోవడంతో బుల్లబ్బాయి ఆఫీసుకు వెళ్తున్నాడు, వస్తున్నాడన్నమాటే కాని ముందు ఉత్సాహం లేదు. పని మీద కూడా పెద్దగా ఆసక్తి లేకుండా ఏదో పోగొట్టుకున్నవాడిలా వుంటున్న బుల్లబ్బాయిని చూసి స్టాఫ్-

''ఏమిటోయ్ బుల్లబ్బాయ్! పెళ్లయి పట్టుమని పదిరోజులు గడవలేదు. కొత్తపెళ్ళికొడుకు ఊపు, ఉత్సాహం లేకుండా ఏమిటిది'' అంటూ పరామర్శించేసరికి చెప్పలేని ఇబ్బందిలో పడిపోయాడు. మరింత నీరుగారిపోయాడు. అప్పటికప్పుడు తన తదుపరి కార్యక్రమంపై ఆలోచనలో పడ్డాడు.

'బహుశా! పంకజంకి ఇంట్లో ఇష్టంలేని పెళ్ళి చేసారేమో తనంటే ఇష్టంలేక సిగరెట్.. మందు అంటూ తనకు అలవాటులేనివి చాతకానివి చెప్పి తనని దూరం వుంచుతుందై వుండాలి. ఏదైమైనా తనకు అలవాటు లేనివి అలవాటు చేసుకునేది లేదని ఖచ్చితంగా చెప్పేయాలి. ముందు పంకజంకి అసలు తనంటే ఇష్టం వుందీ లేనిదీ తేల్చేసుకోవాలి' నిర్ణయానికొచ్చేశాడు. అదే ఆలోచనతో ఇంటికొచ్చాడు.

గుమ్మంలోనే తెల్లచీర.. తెల్ల జాకెట్టు.. జడలో మల్లెలతో వయ్యారంగా గుమ్మానికి జేరబడి పొడవాటి జడను అరచేత గిరగిరా తిప్పుతూ, బాపు బొమ్మలా నవ్వు మొహంతో కనిపించింది పంకజం. గుమ్మం ముందు ఆగి, ఓ క్షణం భార్యకేసి 'ఏమందం' అనుకుంటూ చూసి, అంతలోనే 'అక్కరకురాని అందం వుండీ ఏం లాభం' అనుకుంటూ లోనికి దారితీసాడు మౌనంగా.

''ఏమండీ'' అంటూ అతడి వెనుకే లోనికి వచ్చిన పంకజం ''ఎలా వున్నాను, అందంగా లేనూ..'' అంది బాపు బొమ్మలా జడను చేతబట్టుకునే.

''ఏం లాభం'' గొణిగాడు బుల్లబ్బాయ్.

''లాభనష్టాలు తర్వాత బేరీజు వేసుకుందాం. ముందు స్నానం చేసి ఓ మారు బెడ్‌రూంలోనికి రండి'' అంది.

''అలసిపోయి వచ్చాను. ఇప్పుడు నేనే పని చేయలేను'' అన్నాడు బాత్రూం వైపు కదులుతూ.

''అబ్బ! ఆ సంగతి నాకు తెలుసు. కష్టపెట్టే పని చెప్పను గాని త్వరగా కానిచ్చి రండి'' అంది.

బదులివ్వకుండా బాత్రూంలో జొరబడ్డాడు బుల్లబ్బాయ్.

స్నానం కానిచ్చి అయిష్టంగానే భార్య పిలుపుని తీసేయలేక బెడ్‌రూంలోకి అడుగుపెట్టాడు. లోపలి దృశ్యం చూసి ఒక్కసారిగా అతడి మొహంలోనికి వెయ్యి ఓల్టుల వెలుగొచ్చింది.

మంచం మీద అందంగా పరిచిన మల్లెలు... గదంతా ఆవరించుకున్న అగరువత్తుల పొగ... పరిమళం.. టీపాయ్ మీద అందంగా పేర్చిన మైసూర్‌పాక్.. జిలేబి.. ఆపిల్.. శోభనం గది అలంకరణ.. తన కళ్ళని తానే నమ్మలేనట్టుగా.. అవునా అన్నట్టుగా భార్యకేసి చూసాడు.

పంకజం కళ్ళార్పి.. చేతులు చాచింది.

అంతే! సుడిగాలిలా ఆమెను సమీపించాడు.

''పాపిష్టిదాన్ని ఇంతకాలం.. మిమ్మల్ని ఎంతో కష్టపెట్టాను'' అంది పంకజం భర్త గుండెలమీద సేదదీరుతూ.


''అది సరే! ఇన్ని రోజులూ.. సిగరెట్.. మందు.. అంటూ పట్టుబట్టి హఠాత్తుగా ఇప్పుడిలా..'' అనుమానంగా అడిగాడు.

''ఏ భార్యైనా తన భర్త సిగరెట్ మందు తాగాలని కోరుకుంటుందా?'' భార్య ఎదురు ప్రశ్నతో జుట్టుపీక్కోవాలనిపించినా జాలి చూపులు చూసాడు.

''అదో పరీక్ష'' అంది పంకజం.

''పరీక్షా?'' ఆశ్చర్యంగా చూసాడు బుల్లబ్బాయి.

''ఔను! పెళ్లయి కొత్తగా కాపురానికి వచ్చిన అమ్మాయికి భర్త ఎలాంటివాడో, అతడికి ఏయే అలవాట్లున్నాయో తెలీదు. ఉదయం బుద్ధిగా వెళ్లిన భర్త సాయంత్రం అంతే బుద్ధిగా భార్య దరి జేరుతాడో బార్ దారిపడతాడో? తెలీదు. అదీ భయం''




''బావుంది. కాని దాని కోసం నువ్వు ఇంట్లోనే బార్ సెటప్ పెట్టి.. నువ్వే అందుకు ప్రోత్సహించడం..''

పంకజం నవ్వింది.

''పెళ్ళైన కొత్తల్లో ఎలాంటి అలవాట్లున్నా మగాడు బయటే కానిచ్చుకొస్తాడు తప్ప అంత తేలికగా బయటపడడు. తీరా తెలిసేటప్పటికి పరిస్థితి చేయిదాటిపోతుంది. అందుకే శోభనం రాత్రే మిమ్మల్ని పరిక్షించదలిచాను. మీరు వ్యసనపరులు కాదని ఆ రాత్రే తెలిపోయింది. ఐతే ఒకవేళ ప్రస్తుతానికి బుద్ధిమంతులే అయినా తర్వాత్రర్వాత స్నేహితుల ప్రలోభానికి లోనైతే? సరిగా ఆ దిశలోనే మిమ్మల్ని మరింత పరిక్షించదలిచాను. 'స్త్రీ' మగాడి ఏకైక బలహీనత! ఆ బలహీనతతో దేనికైనా సిద్ధపడతాడు. ఎంతకైనా తెగిస్తాడు. అది తెలిసే 'సిగరెట్.. మందూ తాగితేనే' అని షరతు పెట్టి, శోభనం వాయిదా వేసి, పడకగదిలో మిమ్మల్ని దూరం వుంచుతూ వచ్చాను. అలా అయినా మీరు భార్యకు దూరంగా వుండడానికైనా సిద్ధపడ్డారుగాని వ్యసనాల్ని అలవర్చుకోలేకపోయారు. శోభనంతో ముడిపెట్టినా అది మిమ్మల్ని వ్యసనం దిశగా ప్రలోభపెట్టలేకపోయిందంటే మీ విషయంలో నేనిక నిశ్చింతగా వుండొచ్చన్నమాట. మీరు నిఖార్సయిన బుద్ధిమంతులన్నమాట'' అంది ఆనందంతో మొహం వెలిగిపోతుండగా.

''ఇలా జరిగింది కాబట్టి సరే! ఒకవేళ నేను నాకు లేని ఆ అలవాట్లని నువ్ చెప్పిన బలహీనత కొద్దీ అలవర్చుకుని వుంటే...'' సందేహంగా అడిగాడు.

''అందుక్కూడా ఈ పరీక్ష మార్గదర్శకమే! మీది ప్రలోభపడే 'తత్వం' అని తెలిసేది. మీకు తెలియందేముంది. మొక్కై వంగనిదే మానై వంగునా.. అని సామెత కదా! మిమ్మల్ని కట్టడి చేయవలసిన అవసరం గుర్తించేదాన్ని. కట్టడి చేసే పద్ధతులకి శ్రీకారం చుట్టేదాన్ని'' అంది.

భార్య తెలివికి బుల్లబ్బాయ్ అబ్బురపడుతూ ''ఎలా?'' కుతూహలంగా అడిగాడు.

పంకజం తల అటు ఇటు ఊపుతూ.. ముక్కు మీద వేలుంచి, ''ప్రస్తుతానికి అది సీక్రెట్. భవిష్యత్తులో మీరు నాకా అవసరం కల్పిస్తే అప్పుడు మీకే తెలుస్తుంది లెండి'' నవ్వింది పంకజం.

ఆమె నవ్వులో మల్లెలు జాలువారాయి.

☆